# అంబర్‌పేట నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం

## • ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

కాచిగూడ, డిసెంబర్ 13: అంబర్‌పేట నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా, ప్రజల సహకారంతో సమస్యలను పరిష్కరిస్తున్నట్లు ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ తెలిపారు. బుధవారం కాచిగూడ డివిజన్‌లోని కాచిబస్తీ, తదితర ప్రాంతాల్లో ఆయన అధికారులతో కలిసి పాదయాత్ర నిర్వహించి స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యేకు విన్నవించగా స్పందించిన ఎమ్మెల్యే వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా జలమండలి అధికారులతో కలిసి నల్లకుంట డివిజన్‌లోని గాంధీనగర్ లంక బస్తీలో పర్యటించి డ్రైనేజీ, మంచినీటి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే కాలేరు మాట్లాడుతూ అన్ని నియోజకవర్గాల కంటే అంబర్‌పేటను ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానన్నారు.




కాచిబస్తీలో డ్రైనేజీ సమస్యను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, గాంధీనగర్ లంకబస్తీలో స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే వెంకటేశ్

ఐదు డివిజన్లలో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ కాచిగూడ డివిజన్ అధ్యక్షుడు భీష్మాదేవ్, నల్లకుంట డివిజన్ అధ్యక్షుడు మేడి ప్రసాద్, నాయకులు కె.సదానంద్, ధాత్రిక్ నాగేందర్‌బాబ్జి, కన్నయ్యసింగ్, రూప, సోయంబర్‌సింగ్, బలరాంసింగ్,చందర్‌బాన్‌సింగ్, శేఖర్, స్థానికులు పాల్గొన్నారు.



ఔట్ పేషెంట్ భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, డాక్టర్లు

### మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ వైద్యరంగంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చారని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. ఫీవర్ ఆస్పత్రిలో రూ. 40 కోట్లతో చేపడు తున్న ఔట్ పేషెంట్ భవన నిర్మాణ పనులను ఎమ్మెల్యే కాలేరు బుధవారం పరిశీలించారు. ఆస్పత్రిలోని అన్ని బ్లాక్‌ల్లో తిరుగుతూ రోగుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే కాలేరు మాట్లాడుతూ బిల్డింగ్ పనులను త్వరగా పూర్తిచేసి రోగులకుఅందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. దేశంలోనే హైదరాబాద్‌ను హెల్త్‌హబ్‌గా తీర్చిదిద్దడానికి మాజీ సీఎం కేసీఆర్ శ్రీకారం చుట్టారని, పేదల కోసం 134 రకాల పరీక్షలను అందుబాటులోకి తెచ్చారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఫీవర్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శంకర్, ఆర్‌ఎంఓ డాక్టర్ చంద్రశేఖర్, విజయలక్ష్మి, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు మేడి ప్రసాద్, వైద్యులు పాల్గొన్నారు.

## తాగునీటి పైప్‌లైన్ పనులు ప్రారంభం



బాప్టిస్టు చర్చి వద్ద తాగునీటి పైప్‌లైన్ నిర్మాణ పనులను ప్రారంభించిన ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్, డిసెంబర్ 13: డివిజన్‌లోని రాంనగర్ బాప్టిస్టు చర్చి వద్ద నూతనంగా ఏర్పాటు చేయనున్న తాగునీటి పైప్‌లైన్ నిర్మాణ పనులను బుధవారం ఎమ్మెల్యే ముఠా గోపాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బస్తీల్లో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇప్పటికే చాలా బస్తీలు, కాలనీల్లో కలుషిత నీరు, లోప్రెషర్ సమస్యలకు పరిష్కారం చూపినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నేత ముఠా జయసింహ, డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీధర్‌రెడ్డి,నాయకులు నాగులు యాదవ్, లక్ష్మణ్‌గౌడ్, భిక్షపతి యాదవ్, టెంట్‌హౌస్ శ్రీను, శ్రీధర్‌గౌడ్, ముచ్చుకుర్తి ప్రభాకర్, భాస్కర్, ఏ. శ్రీనివాస్, మచ్చేందర్ తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ నిర్మాణాల కూల్చివేత

ముషీరాబాద్, డిసెంబర్ 13: గాంధీనగర్ డివిజన్ ఆంధ్రాకేఫ్ సమీపంలో చేపడుతున్న అక్రమ నిర్మాణాలను జీహెచ్‌ఎంసీ సర్కిల్-15 టౌన్ ప్లానింగ్ అధికారులు బుధవారం సిబ్బంది సాయంతో కూల్చివేశారు. కార్యక్రమంలో టౌన్‌ప్లానింగ్ అధికారి హఫీజ్, సిబ్బంది పాల్గొన్నారు.

## మంత్రి శ్రీధర్‌బాబుకు సన్మానం



మంత్రి శ్రీధర్‌బాబును సన్మానిస్తున్న మహేందర్‌కుమార్


చిక్కడపల్లి,డిసెంబర్ 13 రాష్ట్ర ఐటీ శాఖ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన శ్రీధర్‌బాబును బుధవారం స్వామి వివేకానంద సొసైటీ ఫర్ రూరల్, అర్బన్ డెవలప్‌మెంట్ ఇండియా స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు కొడిమల మహేందర్‌కుమార్ ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్, తదితరులు ఉన్నారు.



'చెగువేరా లాంగ్ లీవ్' సినిమా పోస్టర్ విడుదల చేస్తున్న చిత్ర యూనిట్, ఎస్‌ఎఫ్‌ఐ, డీవైఎఫ్‌ఐ నాయకులు

## 'చెగువేరా లాంగ్ లీవ్' పోస్టర్ విడుదల

చిక్కడపల్లి,డిసెంబర్ 13 డీవైఎఫ్‌ఐ, ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో బుధవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో 'చెగువేరా లాంగ్ లీవ్' సినిమా పోస్టర్, ట్రైలర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా సినిమా డైరెక్టర్ బాలరాజ్ మాట్లాడుతూ ప్రపంచ విప్లకారుడు యూత్ ఐకాన్ చెగువేరా బయోపిక్‌ని అందరూ ఆదరించాలని కోరారు. సినిమా కోడైరెక్టర్ వినయ్‌కుమార్, డీవైఎఫ్‌ఐ నగర కార్యదర్శులు జావెద్,హస్మిబాబు, ఎస్‌ఎఫ్‌ఐ నగర అధ్యక్ష,కార్యదర్శులు అశోక్‌రెడ్డి, లెనిన్ నాగేందర్, శ్రీమన్నానాయక్, అజయ్, సాయికిరణ్, సూర్య తదితరులు పాల్గొన్నారు.



స్వామివారిని దర్శించుకున్న కార్పొరేటర్ పావనీవినయ్‌కుమార్

## క్షీరలింగేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు

చిక్కడపల్లి, డిసెంబర్ 13 : గాంధీనగర్‌లోని శ్రీ లక్ష్మీగణపతి ఆలయం ప్రాంగణంలో ఉన్న పార్వతి సమేత క్షీరలింగేశ్వర స్వామి వారికి బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్పొరేటర్ పావనీ వినయ్‌కుమార్ స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి పి.లక్ష్మారెడ్డి కార్యక్రమాలను పర్యవేక్షించారు. ఆంజనేయస్వామి దేవాలయ ఈఓ దేవనాథం, తదితరులు పాల్గొన్నారు.

## చిరస్మరణీయుడు వేమరాజు నరసింహారావు



వేమరాజు జయంతి వేడుకల్లో పాల్గొన్న రామలింగేశ్వరరావు, తదితరులు

ముషీరాబాద్,డిసెంబర్ 13: నవ్యనాటక సమితి, నవ్య సాహిత్య సమితి సంస్థలను స్థాపించి సాహితీ, సాంస్కృతిక రంగాలను ప్రోత్సహించిన వేమరాజు నరసింహారావు చిరస్మరణీయుడని విశ్రాంత న్యాయమూర్తి రామలింగేశ్వరరావు అన్నారు. బుధవారం చిక్కడపల్లి త్యాగరాయగానసభలో నవ్యనాటక సమితి 65వ వార్షికోత్సవ వేడుకలు, వేమరాజు నరసింహారావు 94వ జయంతి సభ జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న జస్టిస్ రామలింగేశ్వరరావు మాట్లాడుతూ వేమరాజు నరసింహారావు సాంస్కృతిక రంగ సేవలను ఆయన తనయుడు విజయ్‌కుమార్ కొనసాగించడం అభినందనీయమన్నారు. అనంతరం తెలుగు సాంస్కృతిక రంగ ప్రచారకులు రామావి.శాంతారామ్‌ను ఘనంగా సత్కరించారు. నాట్య గురువులు రేణుక, మృణాళిని, శ్రీలత,వాణీ, భరణి, మధుమతి, స్నేహ, చంద్రశేఖర్ శిష్య బృం దం చేసిన శాస్త్రీయ నృత్యాలు అలరించాయి. కార్యక్రమంలో వసుంధర, ఆచార్య ఫణీంద్ర,ఆనందమోహన్, కుసుమకుమారి, నదూరి విద్యారణ్యస్వామి, సుధారాణి పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

ముషీరాబాద్, డిసెంబర్ 13: ఆజామాబాద్ డివిజన్ 11కేవీ సుందర్‌నగర్, పటేల్‌నగర్ ఫీడర్ల పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏడీఈ విజయభాస్కర్ తెలిపారు. ఉదయం 11.30 నుంచి 2.30 గంటల వరకు క్రిష్ణానగర్, సుందర్‌నగర్, నెహ్రూనగర్,బోన్ ఫ్యాక్టరీ,కాచిగూడ కమేళా పరిసర ప్రాంతాల్లో, మధ్యాహ్నం 12.30 నుంచి 2.30 గంటల వరకు దుర్గానగర్ కమాన్, ఆజాద్‌నగర్, అలీకేఫ్ చౌరస్తాల్లో విద్యుత్ సరఫరా ఉండదు.

## కాంగ్రెస్ అంటేనే అవినీతి, దోపిడీ!

### • ప్లకార్డులతో బీజేపీ నాయకుల నిరసన



ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లో నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

ముషీరాబాద్/చిక్కడపల్లి, డిసెంబర్ 13 : కాంగ్రెస్ పార్టీ అంటేనే దోపిడీ, అవినీతి.. అని ముషీరాబాద్ బీజేపీ కన్వీనర్ రమేశ్‌రామ్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ రాజ్యసభ సభ్యుడు ధీరజ్ సాహు ఇంట్లో దొరికిన నల్లధనంపై రాహుల్‌గాంధీ స్పందించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఆధ్వర్యంలో బుధవారం ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లో ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రమేశ్‌రామ్ మాట్లాడుతూ రాహుల్ గాంధీకి సన్నిహితుడు, భారత్ జోడో యాత్ర ఇన్‌చార్జి ధీరజ్ సాహు ఇంట్లో దొరికిన రూ. 450 కోట్ల నల్లధనం ఆయనదా? రాహుల్‌గాంధీదా? స్పష్టం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. నిరసనలో బీజేపీ నాయకులు జి.వెంకటేశ్, బద్రీనారాయణ, నవీన్‌గౌడ్, రాంరెడ్డి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## రైలు ఢీకొని గుర్తుతెలియని బాలుడు మృతి

కాచిగూడ,డిసెంబర్ 13: రైలు ఢీకొని గుర్తుతెలియని బాలుడు మృతి చెందాడు. హెడ్‌కానిస్టేబుల్ చిమ్నానాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. గుర్తుతెలియని సుమారు 16 ఏండ్ల బాలుడు బుధవారం ఆర్ట్స్ కాలేజ్-జామై ఉస్మానియా రైల్వేస్టేషన్ల మధ్యపట్టాలు దాటుతుండగా గుర్తుతెలియని రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించారు. మృతుడు బూడిద రంగు చొక్కా, నల్ల రంగు ప్యాంట్ ధరించి, 5.5 అడుగుల ఎత్తు ఉన్నట్లు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 8712568495 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

## వ్యక్తి అదృశ్యం



అదృశ్యమైన కృష్ణమాచారి(ఫైల్)

కవాడిగూడ, డిసెంబర్ 13: ఇంటి నుంచి వెళ్లిపోతున్నానని లేఖ రాసి ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన బుధవారం దోమలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. గాంధీనగర్ ఇన్‌స్పెక్టర్ దొంతి రెడ్డి శ్రీనివాస్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. హిమాయత్‌నగర్‌లోని రోడ్ నెంబర్-2లో తిరుమల అవెన్యూలో ఉంటున్న విశ్రాంత ఉద్యోగి మరింగంటి కృష్ణమాచారి(60) ఈనెల 12న రాత్రి పది గంటల సమయంలో ఎవరికీ చెప్పకుండా ఓ లేఖ రాసి వెళ్లిపోయాడు. అనంతరం కృష్ణమాచారి భార్య వెతికినప్పటికీ కనిపించకపోవడంతో గాంధీనగన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు గాంధీనగర్ పోలీస్‌స్టేషన్‌లో తెలియపరచాలని విజ్ఞప్తి చేశారు.

## పైప్‌లైన్ పనుల పరిశీలన

ముషీరాబాద్, డిసెంబర్ 13: రాంనగర్‌లో చేపడుతున్న పైప్‌లైన్ నిర్మాణ పనులను స్థానిక కార్పొరేటర్ కె.రవిచారి బుధవారం పరిశీలించారు. స్థానికులకు ఇబ్బందులు కలుగకుండా పనులు వేగంగా చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఆయన వెంట పలువురు నాయకులు ఉన్నారు.